క్లుప్తంగా

స్మారకోపన్యాసం కరపత్రం ఆవిష్కరణ

సూర్యాపేట : ఈ నెల 24 హైదరాబాద్‌లో జరగనున్న జయశంకర్ సార్ 14వ స్మారకోపన్యాసం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య అన్నారు. శనివారం పట్టణంలోని స్పందన డిగ్రీ కళాశాలలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మదార్ ధర్మార్జున్, నాగరాజు, హరి, వేణు, దుర్గా ప్రసాద్, శంకర్, వినయ్, నర్సయ్య, బాషిపంగు సునీల్, గండూరి కృష్ణ, విజయ్, నాగరాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థుల విద్యాయాత్ర



ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థులు

సూర్యాపేటటౌన్ : జిల్లా కేంద్రంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాల ఫైనల్ ఇయర్ విద్యార్థులు శనివారం ఉస్మానియా యూనివర్సిటీలోని సెంట్రల్ ఫర్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆధునిక విశ్లేషణ పరికరాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. అత్యాధునిక ల్యాబ్‌ను సందర్శించి పరికరాల వినియోగ విధానం, పరిశోధనలో వాటి ప్రాముఖ్యతపై అవగాహన పొందారు. ఓయూలో చదువుతున్న సీనియర్ విద్యార్థులను కలుసుకుని, వారి అనుభవాలు తెలుసుకున్నారు. ఈ యాత్ర వల్ల విద్యార్థుల్లో పరిశోధన పట్ల ఆసక్తి, ఉన్నత విద్యపై ఉత్సాహం పెరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీవాణి తెలిపారు.

చెక్కుల పంపిణీ



సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ జిల్లా నాయకుడు మధుకర్‌రెడ్డి

అర్వపల్లి : సీఎం సహాయ నిధి పేదలకు వరమని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు గుడిపల్లి మధుకర్‌రెడ్డి అన్నారు. జాజిరెడ్డిగూడెం మండల కేంద్రానికి చెందిన రూపని శివకు రూ.28 వేలు, దేవరకొండ పద్మకు రూ.60వేలు చొప్పున సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు కాగా శనివారం వారికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు దాసరి సోమయ్య, ఏఎంసీ డైరెక్టర్ టి.జలేందర్, నర్సింగ వెంకటేశ్వర్లుగౌడ్, దల్వాయి శ్రీధర్, ఉదయ్, హరికృష్ణ, సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రావణమాస పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

అర్వపల్లి : శ్రావణమాసం చివరి శనివారం సందర్భంగా స్థానిక శ్రీయోగానంద లక్ష్మీనర్సింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు పంచామృతాలతో అభిషేకం, విశేష సహస్రనామార్చన, కుంకుమార్చన జరిపారు. తీర్థప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, అర్చకులు రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్, రామకృష్ణ చక్రవర్తి పాల్గొన్నారు.

ఆశ్రమంలో అన్నదానం

సూర్యాపేట : అఖిల భారతీయ అయ్యప్ప ధర్మప్రచార సభ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు రంగు ముత్యంరాజు స్వాతి దంపతుల కూతురు పుట్టినరోజు సందర్భంగా శనివారం పట్టణ పరిధిలోని కుడకుడలోని అన్నపూర్ణ అనాథ ఆశ్రమంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొరిశెట్టి సత్యనారాయణ, రాఘవశెట్టి భీముడు, భరత్ నాయక్, హర్ష, సతీష్, ఆశ్రమ నిర్వాహకులు వనజ, సాయి, అక్షయ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ ఐలయ్యకు సన్మానం

నాగారం : ఉత్తమ స్టేషన్ హౌజ్ ఆఫీసర్‌గా ఎంపికైన నాగారం సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం.ఐలయ్యను మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం పోలీస్ స్టేషన్‌లో శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాగారం అధ్యక్షుడు మంగదుడ్ల దశరథ, నాయకులు కదారి సోమయ్య, చిప్పలపల్లి మల్సూర్, షేక్.భద్రి, చిప్పలపల్లి ఉపేందర్, చంద్రశేఖర్, చిప్పలపల్లి శివ పాల్గొన్నారు.



సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అపరిశుభ్రం.. అవస్థల్లో జనం



ఆర్కేగార్డెన్ ప్రాంతంలో నాలాలో నిలిచిన మురుగు



ఇందిరమ్మ కాలనీలో అధ్వానంగా ఉన్న డ్రెయినేజీ

- దోమలు, కీటకాలకు ఆవాసాలుగా ఖాళీ స్థలాలు
- పెరుగుతున్న పిచ్చి మొక్కలు, నిలుస్తున్న వర్షపు నీరు

సూర్యాపేట అర్బన్ : వర్షాకాలం నేపథ్యంలో సూర్యాపేట పట్టణ వాసులను పారిశుద్ధ్య సమస్య కలవరపెడుతోంది. పట్టణంలో పెరిగిన అపరిశుభ్రత, ఖాళీ స్థలాల్లో నిలిచిన మురుగునీరు, పిచ్చి మొక్కలు దోమలు, ఈగలు వృద్ధి చెందడానికి కారణమవుతున్నాయి. దీనివల్ల డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సమస్యకు ప్రధాన కారణాలు..

సూర్యాపేట పట్టణంలో, ముఖ్యంగా కొత్తగా విలీనమైన గ్రామాలు, శివారు ప్రాంతాల్లో వందల సంఖ్యలో ఉన్న ఖాళీ స్థలాలు, వెంచర్లు సమస్యకు ప్రధాన కారణమవుతున్నాయి. వర్షం నీరు నిలిచి ఉండటం వల్ల ఈ ప్రాంతాలు దోమలకు, పందులకు, కుక్కలకు నివాసాలుగా మారాయి. ఇందిరమ్మ కాలనీ ఫేజ్ 1, 2, 3లతో పాటు సద్దుల చెరువు కట్ట కింద ప్రాంతాలు, నాళాల చుట్టూ మురుగునీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. ఈ ప్రాంతాల్లో పెరిగిన పొదలు, పిచ్చి మొక్కలు విష కీటకాలకు ఆవాసాలుగా మారాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నోటీసులు ఇస్తాం..



వర్షపు నీరు, పిచ్చి మొక్కలతో నిండిన ఖాళీ ప్లాట్లను గుర్తించి వాటిని శుభ్రపరిచే విధంగా వాటి యజమానులకు నోటీసులు ఇస్తాం. దోమల నియంత్రణకు రసాయనాలు పిచికారీ చేయించి, నీరు నిలవకుండా చర్యలు తీసుకుంటాం. మురుగునీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేసి దోమలు వృద్ధి చెందకుండా చూస్తాం.

– హనుమంత రెడ్డి, మున్సిపల్ కమిషనర్

నామమాత్రంగా 100 రోజుల ప్రణాళిక..

పట్టణ పరిశుభ్రత కోసం మునిసిపాలిటీ అధికారులు చేపట్టిన 100 రోజుల ప్రణాళిక పనులు నామమాత్రంగానే ఉన్నాయని ప్రజలు విమర్శిస్తున్నారు. శివారు ప్రాంతాల్లో పరిస్థితి మరింత దయనీయంగా ఉందని, ఈ కార్యక్రమాలు ప్రభావవంతంగా అమలు కాలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖాళీ స్థలాలను గుర్తించి నీరు నిలవకుండా చూడాలని, దోమల నివారణకు రసాయనాలు పిచికారీ చేయాలని, మురుగు గుంతల్లో ఆయిల్ బాల్స్ వేయాలని స్థానిక ప్రజలు మున్సిపల్ అధికారులను కోరుతున్నారు. అంతే కాకుండా, శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించి వాటిని తొలగించడానికి చర్యలు తీసుకోవాలని కూడా సూచిస్తున్నారు.

నేరాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు

- ఎస్పీ నరసింహా



రికార్డులు తనిఖీ చేస్తున్న ఎస్పీ నరసింహా

చివ్వెంల : నేరాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ నరసింహా తెలిపారు. శనివారం మండల పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి, సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. మండలంలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రణాళిక ప్రకారం పని చేయాలన్నారు. పోలీసులు ప్రజలకు అందించే సేవలు, నేరాల నమోదు, పెండింగ్ కేసుల పరిష్కారం, సైబర్ మోసాల పట్ల జాగ్రత్తలు, కేసుల దర్యాప్తు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సీసీ కెమెరాల ఏర్పాటు, మహిళల భద్రతకు తీసుకుంటున్న చర్యలు వంటి అంశాలపై సమీక్ష నిర్వహించారు. ప్రజలకు నైతిక విలువలతో కూడిన సేవలను అందించాలని సూచించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐ రాజశేఖర్, ఎస్ఐ వి.మహేశ్వర్, ఎస్‌బీ సీఐ రామారావు, డీసీఆర్‌బీ సీఐ హరిబాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సురవరం సుధాకర్‌రెడ్డి మృతి తీరనిలోటు



సూర్యాపేట అర్బన్ : సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ పట్టణ కమిటీ సభ్యులు



తుంగతుర్తి: నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

సూర్యాపేట అర్బన్ : కమ్యూనిస్టు యోధుడు, సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్ రెడ్డి మరణం వామపక్ష, ప్రజాస్వామ్య ఉద్యమాలకు తీరనిలోటని సీపీఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు అన్నారు. సీపీఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని ధర్మభిక్షం భవన్, సీపీఐ కార్యాలయంలో సుధాకర్ రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు బొమ్మగాని శ్రీనివాస్, దంతాల రాంబాబు, దోరేపల్లి శంకర్, అనంతుల మల్లేశ్వరి, చామల అశోక్ కుమార్, సీనియర్ జర్నలిస్ట్ దేగల జనార్దన్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాతి సవీందర్ కుమార్, చివ్వెంల మండల కార్యదర్శి ఖమ్మంపాటి రాము, రేగటి లింగయ్య, దీకొండ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి, నల్లగొండ మాజీ పార్లమెంట్ సభ్యుడు సురవరం సుధాకర్ రెడ్డి మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని ఏఐటీయూసీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజారాం అన్నారు. శనివారం తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలో సురవరం సుధాకర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజారాం మాట్లాడారు. సురవరం సుధాకర్ రెడ్డి విద్యార్థి సంఘం నాయకుడి నుంచి సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎదిగారని అన్నారు. పేదలు, బడుగు బలహీన వర్గాల కోసం నిరంతరం పోరాడిన మహనీయుడని కొనియాడారు. నల్లగొండ పార్లమెంట్ సభ్యుడిగా ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పని చేశారని అన్నారు. కార్మికులు, రైతాంగం తరపున పార్లమెంట్‌లో గళం వినిపించారని తెలిపారు. ఆయన లేని లోటు పూడ్చలేనిదని పేర్కొన్నారు. కార్యక్రమంలో కోట రామస్వామి, బి.సతీష్, నరసయ్య, ప్రతాప్, నాగయ్య, భిక్షం, శ్రీను, ఆంధ్రయ, హైమద్, నరేష్, నజీర్, సైదులు, మహేష్, వెంకన్న, మధు తదితరులు పాల్గొన్నారు.

రుణసాయంతో ఆర్థికంగా ఎదగాలి



ఫుడ్ ఫెస్టివల్‌ను ప్రారంభిస్తున్న కమిషనర్

సూర్యాపేటఅర్బన్ : మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా పొందిన రుణాలను సమర్థవంతంగా వినియోగించి వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్, మెప్మా పీడీ హనుమంతరెడ్డి అన్నారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా శనివారం స్థానిక సద్దుల చెరువు వద్ద నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్‌ను ఆయన ప్రారంభించారు. ఫుడ్ ఫెస్టివల్‌లో భాగంగా స్వయం సహాయక సంఘాల మహిళలు వివిధ రకాల సంప్రదాయ వంటకాలను సిద్ధం చేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ మహిళల ప్రతిభను ప్రశంసించారు. మహిళలు ఇలాంటి కార్యక్రమాల ద్వారా వ్యాపార నైపుణ్యాలు పెంచుకొని, భవిష్యత్తులో చిన్న చిన్న యూనిట్లు ఏర్పాటు చేసుకొని స్వయం ఉపాధిని పెంచుకోవచ్చని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో టీపీఓ సోమయ్య, వార్డు అధికారి ప్రణీత, టీఎంసీ శ్వేత, మెప్మా సీఓలు, ఆర్పీలు, మహిళా సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో క్రీడా పోటీలు

తుంగతుర్తి : రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారుల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందని డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు అన్నారు. శనివారం మండలంలోని వెలుగుపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన మండల స్థాయి ఎస్‌జీఎఫ్ వాలీబాల్ క్రీడలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. వాలీబాల్ అండర్–17 బాలికల విభాగంలో వెలుగుపల్లి జెడ్పీహెచ్ఎస్ మొదటి స్థానం, తుంగతుర్తి ట్రైబల్ స్కూల్ రెండో స్థానం సాధించాయి. అండర్–14 బాలికల విభాగంలో వెలుగుపల్లి జెడ్పీహెచ్ఎస్ మొదటి స్థానం, తుంగతుర్తి జెడ్పీహెచ్ఎస్ రెండో స్థానం గెలుచుకున్నాయి. అలాగే అండర్–17 బాలుర విభాగంలో టీజీఆర్ఎస్ తుంగతుర్తి మొదటి స్థానం, తుంగతుర్తి మైనారిటీ స్కూల్ రెండో స్థానం, అండర్–14 బాలుర విభాగంలో తుంగతుర్తి మైనారిటీ స్కూల్ మొదటి స్థానం, తుంగతుర్తి జెడ్పీహెచ్ఎస్ రెండో స్థానం దక్కించుకున్నాయి. ఈ నెల 25, 26 తేదీల్లో వెంపటి పాఠశాలలో మండల స్థాయి ఎస్‌జీఎఫ్ కబడ్డీ క్రీడలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ లింగయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దయానందం, ఎంపీడీఓ శేషు కుమార్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, క్రీడల కన్వీనర్ కొనదాడుపుల యాకయ్య, ప్రధానోపాధ్యాయురాలు ఉషారాణి, గ్రామ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ నరేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై సర్వే



మామిడిపల్లిలో సర్వే చేస్తున్న సీపీఎం నాయకులు

నాగారం : సీపీఎం పోరుబాట కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని మామిడిపల్లి, డి.కొత్తపల్లి గ్రామాల్లో ప్రజా సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కోట గోపి మాట్లాడుతూ వర్షాలకు గ్రామాల్లో అంటువ్యాధులు, విష జ్వరాలు ప్రబలకుండా అధికారులు యుద్ధ ప్రాతిపదికన పారిశుద్ధ్య పనులు చేపట్టాలని అన్నారు. మామిడిపల్లిలో మురుగు కాలువలు లేకపోవడంతో వీధులు బురదమయంగా మారాయని తెలిపారు. గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనలో అధికారులు విఫలమవుతున్నారని అన్నారు. ఫణిగిరి నుంచి మామిడిపల్లి వరకు బీటీ రోడ్డు పూర్తిగా ధ్వంసమై గుంతలమయంగా మారిందని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పులుసు సత్యం, మండల కార్యదర్శి దేవరకొండ యాదగిరి, మండల కమిటీ సభ్యులు కడియం కుమార్, గుడిపూరి వెంకటేశ్వర్లు, కండే భిక్షం, దేవరకొండ వెంకన్న, కండే పద్మ, మొల్కపురి వెంకన్న, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

ఎక్కువ రేట్లకు ఇసుక అమ్మితే కఠిన చర్యలు

నూతనకల్ : ఇసుకను ఎక్కువ రేట్లకు విక్రయించిన వారిపై ప్రభుత్వ నిబంధనల మేరకు చర్యలు తప్పవని తహసీల్దార్ ఎం. శ్రీనివాసరావు అన్నారు. శనివారం నూతనకల్ మండల పరిధిలోని బిక్కుమళ్ల గ్రామంలో ఇసుక రీచ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల కోసం ప్రభుత్వం ఇసుకను ఉచితంగా అందిస్తుందని తెలిపారు. రీచ్ నుంచి తరలిస్తున్న ఇసుకను కొంతమంది ఎక్కువ రేట్లకు విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని తెలియజేశారు. ప్రతి ట్రాక్టర్ యజమాని ప్రభుత్వ నిబంధనల మేరకు లబ్ధిదారులకు ఇసుకను అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ట్రాక్టర్ల యజమానులు తదితరులు పాల్గొన్నారు.


నీటి కోసం ఖాళీ బిందెలతో ఆందోళన



ఖాళీబిందెలతో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలోని ఎస్సీ మాలకాలనీ, మాదిగ కాలనీ, సినిమా టాకీస్ వీధులలో నీటి సమస్యను తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు. శనివారం జాజిరెడ్డిగూడెంలోని ఎస్సీ మాల కాలనీలో ఖాళీ బిందెలతో మహిళలు ఆందోళన చేశారు. గ్రామంలో అదనంగా రెండు ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల నిర్మాణం చేపట్టాలని, అన్ని వీధులకు మిషన్‌భగీరథ నీటిని సరఫరా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్, పగిడిమర్రి శ్రీరాములు, గండమళ్ల ఎల్లేష్, మండల ప్రవీణ్, కట్ల సైదులు, నిమ్మల వెంకన్న, లక్ష్మి, హేమలత, సైదమ్మ, ప్రమోద్, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి పాఠశాలలో ‘ఫుడ్ ఫెస్టివల్’





తాము తయారుచేసిన వంటకాలను పాఠశాలలో ప్రదర్శిస్తున్న విద్యార్థులు

తిరుమలగిరి : తిరుమలగిరి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వృత్తి విద్య కోర్సులో భాగంగా శనివారం విద్యార్థులకు ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల వంటకాలను తయారు చేసి ప్రదర్శించారు. ఒకేషనల్ టీచర్లు గోపి, శాంతి ప్రియ వీరికి మార్గనిర్దేశం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దామర శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్ మృత్యుంజయ, అధ్యాపకులు, ఉపాధ్యాయులు వంటకాలను రుచి చూశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వృత్తి విద్యా కోర్సులతో భవిష్యత్తులో మంచి అవకాశాలు ఉంటాయని తెలిపారు. టూరిజం అండ్ హాస్పిటాలిటీ కోర్సుతో జీవితంలో తొందరగా స్థిరపడవచ్చని తెలియజేశారు.

అనాజిపురం ఆదర్శ పాఠశాలకు రాష్ట్రస్థాయి గుర్తింపు

పెన్‌పహాడ్ : పెన్‌పహాడ్ మండలం అనాజిపురం గ్రామ ఆదర్శ పాఠశాలకు స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్(ఎస్‌సీఈఆర్‌టీ) 2024–2025 విద్యా సంవత్సరానికి గాను ప్రచురించిన ట్రైల్ బ్లేజర్స్ అనే పుస్తకంలో చోటు దక్కిందని ప్రిన్సిపాల్ కోడి లింగయ్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ‘రియల్ చేంజ్ త్రూ ప్రాక్టికల్ ఎఫర్ట్స్’ టైటిల్‌తో తమ పాఠశాల విద్యార్థులు సాధించిన ప్రగతి, ఉపాధ్యాయుల పనితీరు, కమ్యూనిటీ ప్రోత్సాహం గురించి వివరించారని తెలిపారు. మోడల్ స్కూల్‌లో అమలు చేస్తున్న వి టాక్, సమస్యలు–సూచనల పెట్టె, విజన్- నెలవారీ స్కూల్ మ్యాగజైన్, పుట్టిన రోజున సబ్బుల వితరణ, బ్యూటీ, వెల్‌నెస్ సంబంధించి ఆఫ్టర్ స్కూల్ సపోర్ట్ గురించి సవివరంగా 6 పేజీలు ప్రచురించినట్లు వివరించారు. ఈ ఆర్టికల్‌లో భాగస్వాములైన పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులకు జిల్లా విద్యాశాఖ అధికారులు అభినందనలు తెలియజేశారు.

కార్మిక వ్యతిరేక చట్టాలు రద్దు చేయాలి



మాట్లాడుతున్న ఎల్క సోమయ్యగౌడ్

పెన్‌పహాడ్ : కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్క సోమయ్యగౌడ్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన భవన నిర్మాణ కార్మిక సంఘం మూడో మండల మహాసభకు హాజరై మాట్లాడారు. కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. కొత్త విధానాలు ప్రవేశపెట్టి కార్మికులకు సంక్షేమ పథకాలను దూరం చేస్తున్నారని విమర్శించారు. తక్షణమే పెండింగ్‌క్లెయిమ్‌లకు నిధులు విడుదల చేయాలని, కార్మికులకు నష్టం కలిగించే బయోమెట్రిక్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం. రాంబాబు మాట్లాడారు. బోర్డు నిధులను కార్మికుల సంక్షేమానికి మాత్రమే ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా చినపంగి నాగరాజు, ఉపాధ్యక్షుడిగా కొన్ని వెంకన్న, ప్రధాన కార్యదర్శిగా షేక్ నజీరుద్దీన్, సహాయ కార్యదర్శిగా షేక్ ఉస్మాన్, కోశాధికారిగా వెన్న రమణ, మండల కమిటీ సభ్యుడిగా రణపంగ సైదులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు రణపంగ కృష్ణ, నాగరాజు, రాంబాబు, పీరయ్య, వెంకన్న, రాములు, నాగయ్య, నాగేష్ పాల్గొన్నారు.

- నాకు గోవు రక్ష.. గోవుకు నేను రక్ష..



ఓ మహిళ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి వచ్చి సూర్యాపేట పట్టణంలో భిక్షాటన చేస్తోంది. తమ కుటుంబాన్ని పోషించుకునేందుకు పట్టణంలో చంటి బిడ్డను ఎత్తుకొని తిరుగుతూ, బొట్లు పెట్టిన గోమాతను వెంట తీసుకెళ్తూ ఇలా భిక్షాటన చేస్తోంది.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సూర్యాపేట

నల్లబ్యాడ్జీలతో సీపీఎస్ ఉద్యోగుల నిరసన



పెన్‌పహాడ్: నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు



అర్వపల్లి : తిమ్మాపురం జెడ్పీహెచ్ఎస్‌లో..

పెన్‌పహాడ్ : పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎస్ ఉద్యోగులు శనివారం నల్ల బ్యాడ్జీలు ధరించి మండల పరిషత్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా కోశాధికారి గుయ్యాని ప్రసాద్ మాట్లాడారు. 2004లో ప్రవేశపెట్టిన నూతన పెన్షన్ విధానం వల్ల ఉద్యోగులు, వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని టీఎస్ సీపీఎస్ ఏయూ ఆధ్వర్యంలో మండల స్థాయి నుంచి దేశవ్యాప్తంగా పోరాటాలు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో సంపత్‌కుమార్, మౌనిష్ వర్మ, మహేష్, హృదయ్ కుమార్, మోక్షిత్, సైదయ్య, విశ్వం, శివ పాల్గొన్నారు.

అర్వపల్లి : సీపీఎస్‌ను రద్దుచేసి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో శనివారం తిమ్మాపురం జెడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడారు. పీఆర్‌సీని అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కూరపాటి రవీందర్, కె.సీనయ్య, హెచ్ఎం కుంభం ప్రభాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మూడు ఇళ్లలో చోరీ

నాగారం : తాళాలు వేసి ఉన్న ఇళ్లనే లక్ష్యంగా చేసుకొని గుర్తు తెలియని దుండగులు మూడు ఇళ్లల్లో వరుస చోరీలకు పాల్పడిన సంఘటన శుక్రవారం రాత్రి ఫణిగిరి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఫణిగిరిలో గుర్తు తెలియని దుండగులు శుక్రవారం కొమిరెె శ్రీనివాస్ ఇంట్లో చొరబడి పెట్టె తాళం పగులకొట్టి రూ.42వేలు, మచ్చ మారయ్య ఇంటిలో బీరువా పగులకొట్టి రూ.40 వేలు, బత్తుల వెంకన్న ఇంటిలో రూ.10 వేలు, తులం బంగారం, వెండి పట్టా గొలుసులను అపహరించారు. చోరీ జరిగిన ఇళ్ల యజమానులు ఆ సమయాల్లో వివిధ కారణాలతో స్థానికంగా లేరు. ఒకే రోజు 3 ఇళ్లలో చోరీ జరగడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు. కాగా చోరీ జరిగిన ఇళ్లలో ఫోరెన్సిక్ నిపుణులు వచ్చి చోరీ వేలిముద్రలు సేకరించినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. కానీ ఈ చోరీల విషయాన్ని పోలీసులు నిర్ధారించలేదు.

ఆత్మగౌరవ సభకు మద్దతు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

భానుపురి : వచ్చేనెల 1వ తేదీన హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే సీపీఎస్ ఉద్యోగుల ఆత్మగౌరవసభకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు పర్వతం సంధ్యారాణి, యామా రమేష్, తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోతిలాల్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొర్ర భగ్గులాల్ నాయక్ తెలిపారు. శనివారం సూర్యాపేట కలెక్టరేట్ ఆవరణలో ఆత్మగౌరవ సభ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీజీ సీపీఎస్ఈయూ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు నేరెళ్ల దేవరాజు, తపస్ రాష్ట్ర కార్యదర్శి లింగంపల్లి హరిప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు మంచాల రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నిర్మూలనే లక్ష్యం

అర్వపల్లి : క్షయ వ్యాధి నిర్మూలనే లక్ష్యమని మండల వైద్యాధికారి డాక్టర్ భూక్యా నగేష్‌నాయక్ అన్నారు. రామన్నగూడెం గ్రామంలో శనివారం క్షయవ్యాధి నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు పరీక్షలు జరిపారు. ఈ కార్యక్రమంలో టీబీ నోడల్ పర్సన్ కుంభం వీరయ్య, ఎల్‌టీ చొక్కయ్య, హెల్త్ అసిస్టెంట్ గిరిజ, ఆశా కార్యకర్త శైలజ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కోదాడరూరల్ : పట్టణ పరిధిలోని లక్ష్మీపురం 1వ వార్డులో ఎస్‌డీఎఫ్ నిధులు రూ.3లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను మాజీ సర్పంచ్ ఎర్నేని వెంకటరత్నం బాబు శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో సత్యనారాయణ, ముస్తాఫా, నిజాం, రావెళ్ల కృష్ణారావు, ప్రసాద్ పాల్గొన్నారు.